ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 65 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శనివారం 15 జూన్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

ఇక ఎగిరిపోనున్న ట్రూ కాలర్

న్యూఢిల్లీ, జూన్ 14 (ప్రభాత ఉదయం): ఎవరి నుంచి, ఎక్కడి నుంచి కాల్ వస్తోందో తెలిపే యాప్ 'ట్రూకాలర్' ఇక అంతర్ధానం కానుంది. జులై 15 తర్వాత దానవసరం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే టెలికామ్ కంపెనీలు కాల్ చేస్తున్న వ్యక్తి పేరుతో పాటు అతని నంబర్ ను చూపించే విధంగా పనిచేస్తున్నాయి. ముంబై, హర్యానాలో టెలికామ్ కంపెనీలు వాటికి సంబంధించిన ట్రయల్స్ మొదలెట్టాయి. జులై 15లోగా దేశవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని టెలికాం కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది. సిమ్ కొనుగోలు చేసేప్పుడు ఫారమ్ లో నింపే సమాచారం ఆధారంగా ఎవరు, ఎక్కడి నుంచి చేస్తున్నారన్నది తెలుస్తుంది. ట్రాయ్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ ప్రొవైడర్లు తమ కస్టమర్ అప్లికేషన్ ఫారమ్(సిఎఎఫ్)లో ఇచ్చిన పేరు గుర్తింపును ఉపయోగించాల్సి ఉంటుంది. కంపెనీలు పెద్ద ఎత్తున కొనే సిమ్ లకు ఆ కంపెనీ పేరు కనపడవచ్చు.

లా అండ్ ఆర్డర్ పట్ల కఠినంగా వ్యవహరించాలి

డీజీపీకి సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): తెలంగాణలో లా అండ్ ఆర్డర్ పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాలో జరిగిన మైనర్ అమ్మాయి అత్యాచారం, హత్య ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేయాలని డీజీపీని ఆదేశించారు. పోక్సో చట్టాన్ని, ఐపీసీ చట్టాన్ని వినియోగించి, ఫోరెన్సిక్‌ను సమర్థంగా వాడుకొని కేసును పకడ్బందీగా విచారణ చేసి అతిత్వరగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని డీజీపీకి ఆదేశాలు ఇచ్చారు. నిందితునికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన అమానుష ఘటనపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. వెంటనే ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. మరోవైపు నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలంలో పట్టపగలు గువ్వల సంజీవ్ అనే వ్యక్తిని కొట్టి చంపిన ఘటనపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సీరియస్‌గా స్పందించారు. భౌతిక దాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే శక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే, అక్కడి బాధ్యులైన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. భూవివాదం కారణంగా నారాయణపేట జిల్లా ఉట్కూరులో సంజీవ్ అనే వ్యక్తిని కొట్టి చంపిన ఘటనను రాష్ట్ర సర్కారు సీరియస్‌గా తీసుకుంది. భౌతిక దాడులకు దిగి అరాచకాలు, హత్యలకు పాల్పడే శక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే, అక్కడి బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉట్కూరు ఎస్సై బిజ్జ శ్రీనివాసులును సస్పెండ్ చేశారు.



తెలంగాణలో ముందుమాట వివాదం

ఆ ఇద్దరు అధికారులపై వేటు

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): తెలుగు పాఠ్యపుస్తకాలలో ముందుమాటలో చోటు చేసుకున్న తప్పులపై తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం%ొ% అధికారులపై చర్యలకు ఆదేశించింది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ శ్రీనివాసచారి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డిపై చర్యలకు ఆదేశించింది. పాఠ్యపుస్తకాల బాధ్యతల నుంచి వీరిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా%ొ% పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమేశ్‌ను, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల విభాగం డైరెక్టర్‌గా%ొ% టీఆర్ఈఐఎస్ కార్యదర్శి రమణ కుమార్‌కు బాధ్యతలను అప్పగించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న పాఠ్య పుస్తకాల్లో ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, అధికారుల పేర్లను ముద్రించారు. దీంతో 24 లక్షల పుస్తకాలను వెనక్కి తీసుకున్నారు. తొలుత ఆ పేజీలను చించేయాలని అధికారులు నిర్ణయించారు. కానీ దాని వెనుక వందేమాతరం, జాతీయగీతం, ప్రతిజ్ఞ ఉండటంతో%ొ% స్టిక్కర్ వేయాలని నిర్ణయానికి వచ్చారు. పాఠ్యపుస్తకాల్లో కేవలం ముందుమాట పేజీ మార్చి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి. విద్యార్థులకు తప్పుడు సమాచారం వెళ్లకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దీనిపై విపక్షాల విమర్శలు అర్థరహితమని అన్నారు. పుస్తకాలను మళ్లీ ముద్రిస్తున్నామనే ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. దీని వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదన్నారు. ఇప్పటికైనా విపక్షాల ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. తప్పు జరిగినప్పుడు చర్యలు చేపట్టడం తప్పేంకాదన్నారు రామ్మోహన్ రెడ్డి.

ప్రైవేట్ స్కూళ్ల బెడద పోవాలన్నదే ధ్యేయం

విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చేస్తాం

బడిబాట కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ, జూన్ 14 (ప్రభాత ఉదయం): రాబోయే నాలుగున్నరేళ్లలో తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు.ప్రైవేట్ స్కూళ్లను మూసివేసి.. ప్రభుత్వ పాఠశాలలన్నీ తెరుచుకోవాలనేది తమ ప్రభుత్వ నినాదమని అన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పంప్ హౌస్, ప్రాజెక్టు రిజర్వాయర్‌ను పరిశీలించారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లంల గ్రామంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రికి పూర్ణ కుంభంతో అధికార యంత్రాంగం స్వాగతం పలికారు. బ్రాహ్మణ వెల్లంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటి విద్యార్థులతో మంత్రి కోమటిరెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. మంత్రితో పాటు ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ దాసరి హరిచందన, జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి 10 ఏళ్లయిందని.. అసలైన రాష్ట్రం డిసెంబర్ 3న తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే వచ్చిందని చెప్పారు. విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి సారించిదని అన్నారు. ÷ాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు విద్యా వ్యవస్థను పటిష్ట పరచడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. వచ్చే మూడేళ్లలో విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తెస్తామని ఉద్ఘాటించారు. మాజీమంత్రి మల్లారెడ్డి అనురాగ్, గురునానక్ యూనివర్సిటీల పేరుతో దోచుకుంటున్నారని ఆరోపణలు చేశారు. ఈ పాఠశాలలోనే ఏడోతరగతి వరకు తాను చదివానని... తల్లిదండ్రుల తర్వాత పుట్టిన ఊరు చాలా గొప్పదని అన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. విద్యార్థులు పెద్దపెద్ద కలలు కని సాకారం చేసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అనంతరం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును మంత్రి సందర్శించారు. వచ్చే నాలుగు నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకొచ్చి ప్రాజెక్ట్‌ను ప్రారంభించుకుందామని తెలిపారు. డిసెంబర్ లోపు ఈ ప్రాజెక్టులో పూర్తిగా నీళ్లు నింపుతామని అన్నారు. ఇక్కడి చెరువు వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. నార్కట్‌పల్లి డిపోనకు మరో వారం రోజుల్లో 20 కొత్త బస్సులు రాబోతున్నాయని చెప్పారు. మూడు -నాలుగేళ్లలో మూసీ నదిని సుందరీకరిస్తామని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు ప్రగతి భవన్, ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని విమర్శించారు. కూలిపోయిన కాళేశ్వరం ప్రాజెక్టు, విద్య గురించి కేసీఆర్ తన పాలనలో ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు.

అమిత్‌షా ఎఫెక్ట్.. తమిళిసైతో అన్నామలై భేటీ

చెన్నై, జూన్ 14 (ప్రభాత ఉదయం): తమిళనాడులో లోక్‌సభ ఎన్నికల్లో పేలవ ప్రదర్శన అనంతరం రాష్ట్ర భాజపా వర్గాల్లో తీవ్ర విభేదాలు తలెత్తినట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, వీటికి తెరదించేందుకు ఆ పార్టీ నేతలు తమిళిసై, అన్నామలైలు ప్రయత్నాలు చేసినట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా భాజపా సీనియర్ నేత, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసైతో భాజపా తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెపై ప్రశంసలు కురిపించిన ఆయన.. ఆమె రాజకీయ అనుభవం పార్టీ అభివృద్ధికి దోహదం పడుతుందన్నారు. ఇటీవల ఓ వేదికపై కేంద్ర

..మిగతా 2లో

కేటీఆర్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన భారాస నేత కేటీఆర్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేటీఆర్ ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు.. కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల ఆర్వోలకు నోటీసులు ఇచ్చింది. కేటీఆర్ నామినేసన్ సందర్భంగా వాస్తవాలు వెల్లడించలేదని, అందువల్ల ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ తరపున పోటీ చేసిన కేకే మహేందర్‌రెడ్డితో పాటు లగిశెట్టి శ్రీనివాసులు వేర్వేరుగా ఎన్నికల పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు విచారణ చేపట్టారు. నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ అధికారిని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను వాయిదా వేశారు.

ఉక్రెయిన్ వివాదంపై శాంతియుత పరిష్కారం

అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, జూన్ 14 (ప్రభాత ఉదయం): ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కార మార్గానికి భారత్ తన శక్తి మేరకు అన్ని విధాలా ప్రయత్నిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. శాంతికి 'సంభాషణ , దౌత్యం' మాత్రమే మార్గమని శుక్రవారం ఉక్రేనియన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్ స్కీ కి ప్రధాని నరేంద్ర మోడీ తెలియజేశారు. ఇటలీలోని అపులియా ప్రాంతంలో జి-7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోడీ, జెలెన్స్కీని కలిశారు. భారతదేశం మానవ-కేంద్రీకృత విధానాన్ని విశ్వసిస్తుందని కూడా ప్రధాన మంత్రి జెలెన్స్కీకి చెప్పారు. ఉక్రెయిన్‌లో పరిస్థితి, స్విట్జర్లాండ్‌లో జరగనున్న శాంతి సదస్సుపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు మరో మూడు నెలల గడువు

గడువును పొడిగించిన ఉడాయ్

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): ఆధార్‌ను వినియోగదారులు ఉచితంగా అప్‌డేట్ చేసుకోవడానికి గడువును మరో మూడు నెలల వరకూ పొడిగిస్తున్నట్లు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడాయ్) ప్రకటించింది. గతంలో ఇచ్చిన గడువు శుక్రవారం నాటికి ముగియడంతో ఈ తుది తేదీని మరో 3 నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఉడాయ్ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించింది. పెరిగిన గడువు ప్రకారం దేశంలోని ప్రజలు తమ ఆధార్ కార్డులోని వివరాలను 14 సెప్టెంబరు 2024 వరకూ ఉచితంగా అప్‌డేట్ చేసుకోవచ్చు.ఆధార్ గుర్తింపు కార్డుల్లో చాలా ముఖ్యమైన డాక్యుమెంట్ కావడంతో బ్యాంకు ఖాతా ప్రారంభించడం దగ్గర నుండి వృద్ధాప్య పింఛను వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్దిదారుడిగా గుర్తించేంత వరకూ ఉపయోగపడుతోంది. అలాగ్ బస్ టిక్కెట్ బుకింగ్ నుండి ఎయిర్ బస్ టిక్కెట్ వరకూ, పాఠశాలల్లో అడ్మిషన్ల నుండి పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగంలో చేరేంత వరకూ ఆధార్ కీలకంగా మారింది. జననం నుండి మరణం వరకూ ప్రతీ దశలోనూ, ప్రతి విషయానికీ ఆధార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. ఒక విధంగా చెప్పాలంటే ఆధార్ కార్డు అనేది ఒక వ్యక్తికి జాతక చక్రంగా మారింది. దీనిలో ఆ వ్యక్తి పేరు, జండర్, చిరునామా, వయస్సు, ఐరిష్, బయోమెట్రిక్ సమాచారం పూర్తిగా నిక్షిప్తమై ఉంది. ఆధార్‌కు ఉన్న ప్రాముఖ్యత కారణంగా, దానిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం ఎంతో ముఖ్యం. వ్యక్తిగత వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోకపోతే సదరు వ్యక్తి జాతకమే

మారిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం నుండి ప్రైవేటు సంస్థల వరకూ ఎటువంటి ప్రయోజనం పొందాలన్నా ఆధార్ అవసరం. అలాగే ఆధార్ అప్‌డేట్ కూడా అందే అవసరం. ఆధార్ కార్డు తీసుకొని 10 సంవత్సరాలు దాటి ఉంటే అలాంటి వ్యక్తులంతా వీలైనంత త్వరగా వివరాలను అప్‌డేట్ చేయాలని పౌరులందరికీ ఉడాయ్ సూచించింది. వివరాలను నవీకరించడానికి అసరమైన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆధార్ ఉచితంగా అప్‌డేట్ చేసే సదుపాయం ఆన్‌లైన్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఒకవేళ ఆధార్ కేంద్రానికి వెళ్ళి వివరాలను నవీకరించుకోవాలంటే అందుకు కొంత ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు

ఇప్పటికే ఆరుగురు అధికారులు అరెస్టు

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం):గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు పెంచింది. ఇప్పటికే ఈ కేసులో ఆరుగురు అధికారులు అరెస్టు అయ్యారు. ఇప్పుడు ఈడీ జోక్యంతో ఇంకా ఎలాంటి పరిణామాలు జరుగుతాయో అన్న ఆసక్తి నెలకొంది. ఈడీ కేసు నమోదు చేసి 24 గంటలు కాకముందే తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు. గొర్రెల పంపిణీ స్కామ్‌లో కేంద్రంగా మారిన పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులకు లేఖ రాసిన ఈడీ అధికారులు... పలు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగినట్టు తేల్చింది. అవినీతి నిరోధక శాఖను రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెయ్యికోట్లకుపైగా అవినీతి జరిగినట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి ఆరుగురు అధికారులను అరెస్టు చేశారు. ఏసీబీ దర్యాప్తు ఆధారంగా ఇందులో మనీలాండరింగ్ జరిగినట్టు నిర్ధారించుకున్న తర్వాత ఈడీ జోక్యం చేసుకొని కేసు నమోదు చేసింది. దీంతో ఇది ఎవరి మెడకు చుట్టుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తీహార్ జైలులో కవితతో కెటిఆర్ ములాఖాత్

న్యూఢిల్లీ, జూన్ 14 (ప్రభాత ఉదయం): తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితతో ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములాఖత్ అయ్యారు. కవిత యోగ క్షేమాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. కవితను బయటకు తీసుకురావడం కోసం ఆమె కుటుంబం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంది కానీ ఆ ప్రయత్నాలన్నింటికీ దర్యాప్తు సంస్థలు బ్రేకులు వేస్తూనే ఉన్నాయి. ఎప్పుడు బెయిల్ కోసం ఆమె తరుఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా కూడా దర్యాప్తు సంస్థలు కొత్త విషయాలను వెలుగులోకి తీసుకు వస్తున్నారు. దీంతో బెయిల్ వాయిదా పడుతూనే ఉంది.

జలమండలి "డయల్ యువర్ ఎండీ" కార్యక్రమం పునఃప్రారంభం

శనివారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు నిర్వహణ

సమస్యల ఫిర్యాదుకు డయల్ చేయాల్సిన నంబర్లు 040-23442881/2/3

ఇకపై ప్రతి 15 రోజులకోసారి నిర్వహణ

హైదరాబాద్, జూన్ 14(ప్రభాత ఉదయం) జలమండలి వినియోగదారుల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన "డయల్ యువర్ ఎండీ" కార్యక్రమం పునః ప్రారంభం కానుంది. ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్ రెడ్డి.. రేపటి నుంచి ఈ కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభించనున్నారు. రేపు సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు.. గంటన్నర పాటు ఈ కార్యక్రమం జరగనుంది.

కొవిడ్ తో బ్రేక్

కరోనా కంటే ముందు.. ప్రతి నెలా మూడో శనివారం ఖైరతాబాద్ లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగేది. కాని కొవిడ్ తర్వాత కొన్ని కారణాల రీత్యా నిలిచిపోయింది. తాజాగా ఈ ప్రోగ్రామ్ ను మళ్లీ పునఃప్రారంభించాలని ఎండీ సుదర్శన్ రెడ్డి నిర్ణయించారు. అయితే గతంలోలాగా ప్రతి నెలా మూడో శనివారం కాకుండా.. 15 రోజులకోసారి ఈ కార్యక్రమానికి నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదే కాకుండా.. వినియోగదారులు నేరుగా జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ను కలిసే "మీట్ యువర్ ఎండీ" కార్యక్రమాన్ని కూడా త్వరలోనే ప్రారంభిస్తామని వెల్లడించారు.

ప్రజావాణి సైతం..

స్థానిక ఓ అండ్ ఎం డివిజన్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రామాన్ని సైతం పునఃప్రారంభం చేస్తున్నట్లు ఎండీ సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. తాగునీరు, మురుగు నీటి నిర్వహణ, బిల్లింగ్, రెవెన్యూ, ఇతర సమస్యల ఫిర్యాదులు చేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు

సమస్యల్ని ఎండీ దృష్టికి తీసుకురావడానికి.. 040- 23442881 లేదా 23442882 లేదా 23442883 నంబర్లకు ఫోన్ చేసి.. తమ క్యాన్ నంబరుతో పాటు ఇంటి నంబరు చెప్పడం ద్వారా సమస్యల్ని నివేదించవచ్చు. కాబట్టి, వినియోగదారులు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జలమండలి విజ్ఞప్తి చేస్తోంది.

అసలేంటీ కార్యక్రమాలు?

చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ, బిల్లింగ్, మీటరింగ్, ఇతర సమస్యల్ని పరిష్కరించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. జలమండలిలోని పలు సెక్షన్లు, డివిజన్, సర్కిల్ కార్యాలయాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు, ఫిర్యాదులను .. వినియోగదారులు నేరుగా ఎండీకి ఫోన్ చేసి వివరించవచ్చు. డయల్ యువర్ ఎండీ ప్రోగ్రామ్ లో సంబంధిత డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొంటారు కాబట్టి.. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యలు పరిష్కారమవుతాయి.

జూలై 7 నుంచి ఆషాఢ బోనాలు

గోల్కొండ ఉత్సవాలతో ప్రారంభం

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): ఏటా జరిగే ఆషాఢ బోనాలు జూలై7న ప్రారంభం కానున్నాయి. గోల్కొండ బోనాలతో బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో అమావాస్య తర్వాత వచ్చే గురువారం లేదా ఆదివారం గోల్కొండ కోటపై గల శ్రీ ఎల్లమ్మ(జగదాంబిక) ఆలయంలో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈసారి ఆషాఢంలో అమావాస్య జూలై 5న వస్తుంది. తరువాత వచ్చే ఆదివారంజూలై 7 నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ మొదటి పూజ జరిగిన తర్వాత తెలంగాణలోని ఇతర ఆలయాల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గోల్కొండ తర్వాతనే సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి, లాల్‌దర్వాజ మహంకాళి ఆలయంలో పూజలు జరుగుతాయి. ఆషాఢమాసంలో చివరి రోజు గోల్కొండ కోటలోనే చివరి బోనం పూజ జరుగుతుంది. దీంతో బోనాల ఉత్సవాలు సమాప్తం అవుతాయి. గోల్కొండ కోటపై గల శ్రీఎల్లమ్మ(జగదాంబిక) ఆలయంలో జూలై 7నుంచి నెల రోజుల వరకు ప్రతీ గురువారం, ఆదివారం బోనాలు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఇక్కడ తొమ్మిది ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ పూజలకు నగరం నలు మూలల నుంచే గాక, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వస్తారు. గోల్కొండ బోనాల ట్రస్ట్‌బోర్డు కమిటీ పదవీకాలం ముగియడంతో దేవాదాయ శాఖ అధికారులు నూతన కమిటీ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ విడుదలవుతుందని వారు తెలిపారు. ట్రస్ట్‌బోర్డు అధ్యక్ష పదవికి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే చాలామంది రాష్ట్ర మంత్రులను కలుస్తూ తనకు అవకాశం కల్పించాలని కోరారు.

లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(ప్రభాత ఉదయం)జోగుళాంబ గద్వాల జిల్లా మైనారిటీస్ గురుకుల పాఠశాల మరియు కళాశాలల యందు టీచర్స్, లెక్చరర్స్ కొరకు మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతునట్లు జిల్లా మైనారిటిస్ సంక్షేమ శాఖ అధికారి యం.ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల గురుకుల పాఠశాల యందు పిజిటి ఇంగ్లీష్, టిజిటి సైన్స్ పోస్టులకు మరియు అలంపూర్ మండలం ఉండవెల్లి నందు తెలంగాణ మైనారిటీస్ గురుకుల పాఠశాల టిజిటి గణితం, మరియు కళాశాల యందు జూనియర్ లెక్చరర్ ఎకనామిక్స్, ఆర్ట్ %డ% క్రాఫ్ట్ పోస్టులకు దరఖాస్తులనుకోరుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల గల మహిళ అభ్యర్థులు ఈ నెల 22 తేది లోగా దరఖాస్తులను జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ గద్వాల్ నందు సమర్పించగలరని, మరిన్ని వివరాలకు సెల్ నెంబర్: 8099059007 సంప్రదించగలరని ఆయన తెలియజేశారు.

కాంగ్రెస్ హామీలు నీటిమూటలు

మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నీటి మూటలను తలపిస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన కాంగ్రెస్ పార్టీ, 191 రోజులు గడిచినా ఆచరణలో మాత్రం విఫలమైందని విమర్శించారు. పక్క రాష్ట్రం ఏపీలో అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి అన్ని రకాల పింఛన్లు పెంచితే, ఒడిశా ముఖ్యమంత్రి వరి కనీస మద్దతు ధర క్వింటల్‌కు రూ. 3100 చేస్తూ నిర్ణయం తీసుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవుపలికారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా వృద్ధులు, వితంతువుల పింఛన్లు రూ.4 వేలు, దివ్యాంగులకు 6 వేలు పెంచుతూ తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. 10 శాతం మాత్రమే పండించే సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని చేతులు దులుపుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ఆరు గ్యారెంటీలు, 13 హామీలను అమలు చేయాలన్నారు.

తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ వాకాటి కరుణ ఇద్దరూ కలిసి శుక్రవారం నాడు ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్, బర్త్ డేట్ ఆధారంగా అధికారిక వెబ్ సైట్ లో ఫలితాలను తెలుసుకోవచ్చు. కాగా, ఈ ఫలితాల్లో 91.92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 5, 6 తేదీల్లో ఐసెట్-2024 ఎగ్జామ్ నిర్వహించారు. ఐసెట్ కోసం మొత్తం 86,156 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 71,647 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐసెట్ ఫలితాల కోసం అధికారిక వెబ్‌సైట్ క్లిక్ చేయొచ్చు.

అమిత్‌షా ఎఫెక్ట్.. తమిళిసైతో అన్నామలై భేటీ

మొదటి పేజీ తరువాయి...

హోంమంత్రి అమిత్‌షా- తమిళిసై మధ్య సీరియస్ చర్చ జరిగిన కొన్ని రోజుల్లోనే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. "పార్టీ సీనియర్ నేతల్లో ఒకరు, తమిళనాడు భాజపా అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేసిన 'అక్క తమిళిసై'తో భేటీ కావడం చాలా సంతోషంగా ఉంది. రాష్ట్రంలో కమలం తప్పకుండా వికసిస్తుంది. ఇందుకోసం ఆమె చాలా కష్టపడ్డారు. ఆమె రాజకీయ అనుభవం, సలహాలు పార్టీ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయి" అని అన్నామలై ట్వీట్ చేశారు. అటు తమిళిసై స్పందిస్తూ.. అన్నామలైతో సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు. ఇదిలాఉంటే, ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మధ్య సీరియస్‌గా సాగినట్లు కనిపించిన సన్నివేశంపై తీవ్ర చర్చ జరిగింది. ముఖ్యంగా తమిళనాడులో భాజపా నేతల మధ్య అంతర్గత విభేదాల గురించే వీరు మాట్లాడుకున్నారనే వార్తలు వినిపించాయి. అయితే, ఆ ఊహాగానాలను కొట్టిపారేసిన తమిళిసై.. రాజకీయ, నియోజకవర్గ కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని అమిత్ షా సలహా ఇచ్చారని చెప్పారు. ఇది జరిగిన కొన్ని గంటలకే మాజీ గవర్నర్‌తో అన్నామలై భేటీ కావడం గమనార్హం.

జూలై 6న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

భారీగా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు

హైదరాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం జూలై 9న వైభవంగా జరుగనుంది. వీటిని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. జూలై 8న ఒగ్గు కళాకారులతో పుట్టమన్ను తెప్పించడంతో పాటు ఎస్ఆర్‌నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఎదుర్కోళ్లు, (శాత్తేయముగా) నిర్వహిస్తూ ఎల్లమ్మ దేవాస్థానం వరకు ఊరేగింపుగా రావడంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9న ఆలయానికి తూర్పు ముఖంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తారు. 10వ తేది 6 గంటలకు కల్యాణం వీక్షించేందుకు రాష్ట్ర నలు మూలల నుంచి వచ్చే భక్తులతో రథోత్సవ కార్యక్రమం ఉంటుంది. దీంతో ఉత్సవాలు ముగుస్తాయి. గత సంవత్సరం నిర్వహించిన కల్యాణానికి భక్తులకు ఎలాంటి అసౌకర్యాం కలుగకుండా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నెల రోజుల ముందుగానే వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించేవారు. ఈ సారి మాత్రం కల్యాణ సమయం దగ్గర పడుతున్నా ఏర్పాట్లు, ఆలయ సుందరీకరణపై ఆలయ చైర్మన్, అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఈవో నాగరాజు లాంగ్ లీవ్‌లో ఉండడం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు తీసుకున్న జ్యువెల్లరీ ఇన్‌స్పెక్షన్ అధికారి(జేవివో) అంజలి దేవి ఏర్పాట్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు. గత సంవత్సరం అమ్మవారి కల్యాణం వీక్షించేందుకు అంచనాలకు మించి భక్తులు 10 లక్షల మంది విచ్చేశారు. ఈ సారి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయనున్న నేపథ్యంలో సౌకర్యాలపై అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది.

అదుపుతప్పి కట్టెల లారీ బోల్తా

అక్కడే ఉన్న కానిస్టేబుల్, టీచర్ దుర్మరణం

మహబూబాబాద్, జూన్ 14 (ప్రభాత ఉదయం): మహబూబాబాద్ జిల్లాలోఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం మహబూబాబాద్ నుంచి నర్సంపేట కట్టెల లోడుతో వెళుతున్న లారీ గూడూరు మండల కేంద్రంలో మూలమలుపు వద్ద టర్న్ అవుతుండగా బోల్తా పడింది. అదే సమయంలో అక్కడే రోడ్డుపై నిలిచి ఉన్న గూడూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ దనసరి పాపారావు, సీఆర్‌టీ టీచర్ చించ దేవేందర్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలు కాగా అతడిని గూడూరు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్, లారీ క్లీనర్ ఇద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితు కుటుంబాలకు న్యాయం చేయాలని గిరిజన సంఘాలు వచ్చి రోడ్డుపై పైఠాయించి ధర్నా నిర్వహించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ రామ్ నాద్ కేకన్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక పోలీసుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డుపై పడి ఉన్న కట్టెల లారీ క్లియర్ చేయించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్‌కు శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ తాలూకా

ఉద్యోగ సంఘాల నాయకులు

టీఎన్జీవోస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల నాయకులు

టీఎన్జీవోస్ నేత ఎస్ఎం హుస్సేనీ ముజిబ్ తో ఉద్యోగులు

బుద్వేల్, జూన్14(ప్రభాత ఉదయం) : ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాడే డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ తెలంగాణ రాష్ట్ర టీఎన్జీవోస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం సంతోషకరమని రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల నాయకులు ఎం ఎ నయీమ్, ఎస్ యాదయ్య ముదిరాజ్ , ఎం శ్రీనివాస్ యాదవ్ , ఎస్ జగరామ్ అన్నారు. టీఎన్జీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ ను శుక్రవారం రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాజేంద్రనగర్ ప్రాంత వాసిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేస్తూ అటు ఉద్యోగుల మన్ననలే కాకుండా ప్రజల అభిమానం చురగొన్న నాయకుడు ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ అని కొనియాడారు.

టీజీ ఐసెట్‌లో ఉప్పర్‌పల్లి వాసికి

స్టేట్ ఫస్ట్ ర్యాంక్

బుద్వేల్, జూన్14(ప్రభాత ఉదయం) : తెలంగాణ రాష్ట్ర ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఐ సెట్) లో రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి కి చెందిన సయ్యద్ మునీబుల్లా హుస్సేనీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ఐటి పూర్తి చేసి నగరంలోని హైటెక్ సిటీలో సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ గా పనిచేస్తున్న సయ్యద్ మునీబుల్లా హుస్సేనీ టీ జీ ఐ సెట్ లో ప్రథమ ర్యాంకు సాధించారు. మంచి కాలేజీలో ఎంబీఏ చేయాలని ఉందన్నారు.



సయ్యద్ మునీబుల్లా హుస్సేనీ

హమీదుల్లా నగర్‌లో బడి బాట

శంషాబాద్, జూన్ 14(ప్రభాత ఉదయం) గ్రామంలోని విద్యార్థినీ విద్యార్థులు అందర్నీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని శంషాబాద్ మండల టిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవులపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పాఠశాలలు పునర్ ప్రారంభమైన సందర్భంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగ శుక్రవారం సాముహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థినీ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించడంతోపాటు దాతలు వారికి మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లను అందజేశారు. ఏ ఏ పి సి చైర్మన్ శ్రీమతి ఇందిరా , పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిందర్ గౌడ్ గ్రామ సెక్రటరీ రవికాంత్ , అంగన్వాడీ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుకు వినతిపత్రం అందజేస్తున్న టిఆర్ఎస్ నాయకులు మురళీకృష్ణ

బోనాలకు భారీగా ఏర్పాట్లు చేయాలి

కమిషనర్‌ను కోరిన తోకల మురళి యాదవ్.

శంషాబాద్. జూన్ 14. ప్రభాత ఉదయం . శంషాబాద్ పురపాలక సంఘంలో బోనాల వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని శంషాబాద్ టిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు తోకల మురళీకృష్ణ యాదవ్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావుకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ప్రాంతంలో అత్యంత వైభవంగా తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడే విధంగా నిర్వహించే బోనాల ఉత్సవాలకు తగిన ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంత ఉన్నదని సూచించారు. ప్రధానంగా పురపాలక సంఘం పరిధిలోని పోచమ్మ బస్తిలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారని మురళీ కృష్ణ యాదవ్ తెలిపారు. కమిషనర్ సుమన్ రావు ప్రత్యేక చొరవ తీసుకొని పోచమ్మబస్తీలో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు ఇబ్బందులు ఏర్పడకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

మైహోం అవతార్ 14వ అంతస్థు పైనుంచి

దూకి ఆత్మహత్య

మృతురాలు హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ ఉద్యోగి

నార్సింగి, జూన్ 14 (ప్రభాత ఉదయం) మైహోం అవతార్ 14.వ, అంతస్థు పైనుంచి దూకి ఓ మహిళా ఉద్యోగిని ఆత్మహత్య చేసుకుంది. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం నార్సింగిలో ఉన్న మైహోం అవతావర్లో జనార్ధన్రెడ్డి, అనురాధ దంపతులు తమ బిడ్డలతో ని వాసముంటున్నారు. జనార్ధన్రెడ్డి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, అనురాధ హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా ఉద్యోగాలు చేస్తున్నారు. గత కొంత కాలంగా అనురాధ మూఢీగా ఉంటుంది. ఉ ద్యోగం మాని ఇంట్లోనే ఉండాలని భర్త సూచించాడు. అయినా ఆమె ముభావంగా ఉంటుంది. ఏ విషయంలోనో ఆమె బాధపడుతూ కనిపించేది. శుక్రవారం 14. వ, అంతస్టు పైనుంచి కిందకు దూకేసింది. తీవ్ర గాయాలపాలై ఆమె మృతి –చెందింది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. భర్త జనార్ధన్రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి ఎస్.ఐ అశోక్ తెలిపారు.

నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

నార్సింగి, జూన్14(ప్రభాత ఉదయం) నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన గండిపేట గ్రామం, గండిపేట ప్రధాన రహదారి, గూంచా హిల్స్, విల్లా గ్రీన్ పరిసర ప్రాంతాలలో శనివారం ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

కేక్ కట్ చేస్తున్న పెండెం రవీందర్. చిత్రంలో పాత్రికేయులు

ఘనంగా ప్రజాసాక్షి రిపోర్టర్ పెండెం రవీందర్ జన్మదిన వేడుకలు

బుద్వేల్, జూన్14(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజాసాక్షి రిపోర్టర్ పెండెం రవీందర్ జన్మదిన వేడుకలు మైలార్ దేవులపల్లి డివిజన్ దుర్గానగర్ లో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో రాజేంద్రనగర్ నియోజవర్గ సీనియర్ జర్నలిస్టులు, తోటి స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. .ఈ సందర్భంగా పాత్రికేయులు పెండెం రవీందర్ పూలమాలతో సన్మానించి శాలువాతో సత్కరించారు. అనంతరం పెండెం రవీందర్ చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో తీయుడబ్ల్యుజె రాష్ట్ర దాడుల నివారణ కమిటీ సభ్యులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, రాజేంద్రనగర్ మండల తీయుడబ్ల్యుజె అసోసియేషన్ అధ్యక్షుడు మేకల దామోదర్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు మేక్కొండ ప్రేమ్ రాజ్, రాజేంద్రనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వర్కాల చందు, బుడిగెళ్ళ బాబురావు , కోరని మహేష్ గద్దె యాదగిరి, బంధుమిత్రులు యంజాల వెంకటేష్, యం జాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు

పెండెం రవీందర్

హిమాయత్ నగర్లో ఏర్పాటు చేసిన హొటల్ను ప్రారంభిస్తున్న చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్

నాణ్యమైన భోజనంతోనే ఆరోగ్యం మేలు

చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ స్వామి

మొయినాబాద్ జూన్ 14 (ప్రభాత ఉదయం) ప్రజలు నాణ్యమైన భోజనం తీసుకున్నప్పుడే ఆరోగ్యానికి మేలు కలుగుతుందని చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్యరాజన్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలో గ్రూప్ కేఫ్ ఎయిర్, గ్రూప్ బ్లాంకెట్ సంస్థను లక్ష్మీభాయి, ఉమ్మిల దేవిలు ఏర్పాటు చేయగా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్యరాజన్ శుక్రవారం విచ్చేసి వేధమంత్రాలతో జ్యోతిప్రజ్వాలన చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిమాయత్ నగర్ చౌరస్తాలో లక్ష్మీభాయి, ఉమ్మిల దేవిలు ఏర్పాటు చేసిన హొటల్ ప్రజలకు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించినప్పుడే వారి ఆరోగ్యానికి కృషి చేసిన వారు అవుతారని తెలిపారు. ప్రజలతో కలిసిమెలిసి ఉన్నప్పుడే వ్యాపారం సజావుగాజరుగుతుందన్నారు. జాతీయ రహదారి రోడ్డు పక్కన హొటల్ను ఏర్పాటు చేసుకోవడం ఎంతోబాగుందన్నారు. ప్రజలకు మంచి ఆహారాన్ని అందించి వారి ఆరోగ్యం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేధమంత్రాలతో జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్

రాందేవ్ రావ్ హాస్పటల్లో ఘనంగా

రక్తదాన దినోత్సవ వేడుకలు

రక్తదానం చేయండి.... ప్రాణదాతలు కండి డాక్టర్ కే కమలాకర్...

కూకట్‌పల్లి, జూన్ 14 (ప్రభాత ఉదయం) ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే వేరొకరికి ప్రాణదాతలు అవుతారని రాందేవ్ రావ్ హాస్పిటల్ ఎండి డాక్టర్ కే కమలాకర్ అన్నారు. శుక్రవారం రాందేవ్ రావ్ హాస్పిటల్ లో ఘనంగా రక్తదాన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కర్ల్ ల్యాండ్‌స్టేనర్ జన్మదినం సందర్భంగా రక్తదానం మీద రక్తదానం యొక్క ఆవశ్యకతను రోగులకు, అటెండర్లకు, కూకట్ పల్లి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. వీకేఆర్ బ్లడ్ సెంటర్ వారితో కలిసి రాందేవ్ రామ్ హాస్పిటల్ లో ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానంలో భాగంగా 300 సార్లు రక్తదానం ఇచ్చిన సంపత్, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన పదిమందిని రాందేవ్ రామ్ హాస్పిటల్ ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి డాక్టర్ కమలాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి ప్రాణదానం చేయాలని కోరారు. రక్తదానం వలన మరొకరికి ప్రాణదానం చేసిన వారు అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. వికేఆర్ బ్లడ్ సెంటర్ డైరెక్టర్ సుమన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి మరొకరి అనారోగ్యం నుండి కాపాడాలని డోనర్లకు పిలుపునిచ్చారు. ఇంకోసారి రక్తదానం ఇచ్చిన వారి ఆరోగ్యం పైన కూడా దృష్టి పెట్టాలని డాక్టర్లకు సూచించారు. అలాగే బాలానగర్ లోని ఈఎల్ఐసిఓ పరిశ్రమలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారని రాందేవ్ రావ్ సీఈఓ డాక్టర్ యోబు తెలిపారు. ఈ రక్తదానంలో శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సురేష్, హేమంత్, కిరణ్, సంపత్, సుశీల్ కుమార్, శంకర్, పృథ్వీధర్ రెడ్డి, క్రాంతి కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నాయకులు సాయి రామ్ గౌడ్

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన యువ మోర్చా జాతీయ నాయకులు రాగిరి సాయిరాం గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 14 (ప్రభాత ఉదయం) ఢిల్లీలోని అధికార నివాసంలో కేంద్రమంత్రి బండి సంజయ్ ని భాజపా యువమోర్చ జాతీయ నాయకులు రాగిరి సాయిరామ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బండి సంజయ్ కి సముచిత స్థానం కల్పించినందుకు పార్టీ అధ్యక్షులు జేపీ నడ్డా, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, ప్రధాని మోడీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మండల సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ సరిత

అధికారుల పనితీరు మార్చుకొని ప్రజలకు సేవలు అందించాలి

జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య

ధరూర్,జూన్14(ప్రభాత ఉదయం)అధికారులు తమ పనితీరును మార్చుకుని, ప్రజలకు సేవలు చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. శుక్రవారం ధరూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నజ్మానిషా బేగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరైనారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాలలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై ఆమె అధికారులతో అరా తీశారు. వివిధ శాఖల అధికారులకు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. గ్రామాలలో విద్యుత్ సమస్యలు పేరుక పోయాయని విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలు నిత్యం తమ దృష్టికి తీసుక వస్తున్నారని ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సమావేశాలలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యలు పరిష్కారం కాలేదని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాలలో కరెంట్ సమస్య తీవ్రంగా ఉందని అధికారులు స్పందించకపోవడంతో సమస్యలు తీవ్రమవుతున్నాయని, దీంతో గత ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో 10 శాతం పెంచి విద్యుత్ అందజేస్తుందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చె ఏ శాఖ అధికారులనైన ఉపేక్షించే ప్రసక్తి లేదని, ప్రభుత్వానికి ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు... వర్షాకాలం కొనసాగుతున్న సందర్భంలో గ్రామాలలో పారిశుద్ధంపై పంచాయతి సెక్రెటరీలు గ్రామాలలో త్వరితగతిన పూర్తి పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాలలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహించి, రోగాల పట్ల చైతన్యపర్చలని ఆదేశించారు. ఏది ఎమైన ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న అధికార యంత్రాంగం పనితీరును మార్చుకొని విధులు నిర్వహించాలని జెడ్పి చైర్ పర్సన్ సరితమ్మ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పద్మ వేంకటేశ్వర రెడ్డి, ఎంపిపి నజ్మానిస బేగం, ఎంపిడిఓ మంజుల, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతి సెక్రెటరీలు తదితరులు ఉన్నారు..

అద్వానీ సూర్యా రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బిజెపి నాయకులు

ఘనంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్వానీ సూర్యారావు జన్మదిన వేడుకలు

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేవైఎం రాష్ట్ర నాయకులు అక్కినపల్లి సాయికుమార్

కూకట్‌పల్లి, జూన్ 14 (ప్రభాత ఉదయం) బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అద్వానీ సూర్యారావు జన్మదిన సందర్భంగా కూకట్ పల్లి లోని భారత జనతా పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు సాయికుమార్ ఆయనకు పుష్పగుచ్చం అందించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగుల రాజిరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు గోవర్ధన్ చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బాలు యాదవ్, నరేష్, పవన్, సంధ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కేశవ్

గద్వాల పట్టణంలో చెత్త పన్నుకు బ్రేక్ వేసిన మున్సిపల్ కౌన్సిల్

ప్రభుత్వమే యధావిధిగా చెత్త సేకరణ చేపడుతుంది - మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(ప్రభాత ఉదయం) గద్వాల పట్టణంలో చెత్త పన్నుకు బ్రేక్ వేసింది మున్సిపల్ కౌన్సిల్. ప్రభుత్వమే యధావిధిగా చెత్త సేకరణ చేపడుతుంది అని మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ అన్నారు. ఇక నుండి గద్వాల పట్టణ ప్రజలకు చెత్త పన్నుకు ఉపశమనం తేల్చి చెప్పారు చైర్మెన్ బిఎస్ కేశవ్. పాత పద్ధతిలోనే చెత్త సేకరణ ఉంటుందని రాష్ట్రంలోని 33 జిల్లాలలోని మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో చెత్త ప్రైవేటీకరణ చేపట్టగా దానికి భిన్నంగా నేడు గద్వాల జిల్లా కేంద్రంలో ప్రజల అదృష్టం మేరకు యధావిధిగా ప్రభుత్వమే చెత్త సేకరణ చేపట్టే కార్యక్రమం యధావిధిగా చేపడుతున్నట్లు శుక్రవారం రోజు మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఇట్టి విషయాన్ని వెల్లడించారు మున్సిపల్ చైర్మన్ బి.ఎస్.కేశవ్. చెత్త ప్రయివేటీకరణపై ప్రభుత్వ ఆదేశాలు మాత్రమే అమలు చేశామన్నారు చైర్మెన్. మున్సిపల్ పరిధిలోని పట్టణంలోని ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరించి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అట్టి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ బి. ఎస్ కేశవ్ తెలిపారు.

సహకార సంఘాల బలోపేతం కావాలి

మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ కోపరేషన్ క్రిషన్ గుర్జాల్ సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధి

హైదరాబాద్, జూన్14(ప్రభాత ఉదయం)సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధి చెందుతుందని సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధి చెందుతుందని మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ కోపరేషన్ క్రిషన్ గుర్జాల్ అన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి అధ్యక్షత వహించిన సమావేశం వివరాలు వెల్లడించిన డాక్టర్ యస్. ఎల్. ఎన్. టి. శ్రీనివాస్, స్టేట్ కోఆర్డినేటర్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ కోపరేషన్ క్రిషన్ గుర్జాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర సహకార శాఖ భవిష్యత్తు ప్రణాళికలు, సహకార సంఘాల బలోపేతం గురించి చర్చించడం జరిగినది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రానున్న ఐదు సంవత్సరాల కాలంలో రెండు లక్షల నూతన మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీస్ ని ఏర్పాటు చేస్తున్నట్లు మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ కరణ చేపట్టినట్లు తెలిపినారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలు వివిధ కార్యక్రమాలు చేపట్టడానికి వీలుగా మోడల్ బైలాసును ప్రతిపాదించడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సహకార శాఖ అడిషనల్ సెక్రటరీ శ్రీ పంకజ్ కుమార్ బన్సల్, శ్రీ ఆనంద్ కుమార్ జ జాయింట్ సెక్రెటరీ శ్రీ కపిల్ మీనా డైరెక్టర్ లు పాల్గొన్నారు.

పోలీస్ అధికారితో సివిల్ తగాదాల పై మాట్లాడుతున్న న్యాయవాదులు

సివిల్ తగాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు

గద్వాల న్యాయవాదుల విధుల బహిష్కరణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(ప్రభాత ఉదయం)జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. సివిల్ వివాదంలో తలదూర్చడంతో పాటు ప్రశ్నించిన న్యాయవాది ఇ.సురేష్ గౌడ్ ను దుర్భాషలాడి, బెదిరింపులకు దిగిన అయిజ ఎస్ఐ విజయ భాస్కర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక న్యాయవాదులు ఆందోళన చెప్పట్టారు. అందులో భాగంగా జిల్లా న్యాయస్థాన సముదాయ ప్రధాన గేటు ముందు కొద్ది సేపు తమ నిరసనను వ్యక్తం చేస్తూ ఎస్ఐ కు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి గద్వాల డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. అంతకన్నా ముందు కోర్ట్ విధులను బహిష్కరించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుషకు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితతో పాటు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్ నాయక్ కు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గద్వాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రఘురామిరెడ్డి మాట్లాడుతూ అయిజ పోలీస్ స్టేషన్ తో పాటు జిల్లాలో ఉన్న దాదాపు అన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్ఐలు సివిల్ తగాదాల్లో తలదూర్చుతున్నారన్నారు. పోలీసులను సివిల్ తగాదాల్లో తలదూర్చవద్దని అత్యున్నత, ఉన్నత న్యాయస్థానాలతో పాటు ఉన్నతాధికారులు ఎన్ని మార్లు చెప్పిన కింది స్థాయిలో ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదన్నారు. పైగా ప్రశ్నించిన పౌరులను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖాజమొహినుద్దీన్, ప్రధాన కార్యదర్శి కొండాపురం షఫీవుల్లాతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

హిమాయత్నగర్లో మాట్లాడుతున్న చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి భీమ్ భరత్

స్వయం ఉపాధితో యువత ఆర్థిక అభివృద్ధి చెందాలి

చేవెళ్ల కాంగ్రెస్పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి భీమ్ భరత్

మొయినాబాద్ జూన్ 14 (ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆరు గ్యారెంటీలతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తుందని చేవెళ్ల కాంగ్రెస్పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి భీమ్ భరత్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్నగర్ చౌరస్తాలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి ఎంచుకున్నప్పుడు ఆ ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అందరితో కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి ప్రజలకు నాణ్యతతో ఉన్నప్పుడే అందరు అలవాటు పడతారని తెలియజేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగ యువత అభివృద్ధి కోసం ఉద్యోగాలు వచ్చిన వారు కాకుండా రాని వారికి స్వయం ఉపాధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. యువత నిరుద్యోగంగా ఉండకుండా ఏదో ఒక స్వయం ఉపాధిని ఎంచుకోని మంచి మార్గంలో నడిచినప్పుడే ఆర్థికంతో కుటుంబ పోషణ సాధ్యమవుతుందన్నారు. ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా నేటి యువత సమాజంలో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కేవ్ ఎయిర్ సంస్థ లక్ష్మిభాయి, ఉర్మిలదేవి, చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సౌందర్యరాజన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్త జైపాల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, మాజీ జెడ్పీటీసీ కంజర్ల భాస్కర్, నాయకులు షాబాద్ రాజు, సంజీవరెడ్డి, రాజయ్య, మర్రి రవీందర్రెడ్డి, బాలకృష్ణారెడ్డి, మక్బుల్, రమేష్, టిల్లు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.